సాక్షి
నల్లగొండ
మంగళవారం । 21 । ఫిబ్రవరి । 2023



ప్రభుత్వాన్ని నిలదీద్దాం
ప్రజా సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీద్దామని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. - 8లో



ముగిసిన పోలీస్ ఈవెంట్స్
పోలీస్ ఉద్యోగాల భర్తీలో భాగంగా నల్లగొండలో నిర్వహించిన ఈవెంట్స్ సోమవారం ముగిశాయి. - 8లో

గరిష్టం/కనిష్టం
37°/17°

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది
మధ్యాహ్నం ఆహ్లాదకరంగా ఉంటుంది
రాత్రి చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ

నల్లగొండ క్రైం: భూ సంబంధిత తగాదాలతో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ అపూర్వరావు అన్నారు. సోమవారం నల్లగొండలోని తన కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్‌లో బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి మాట్లాడారు. ఫిర్యాదులపై సమగ్ర దర్యాప్తు చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు.

జోడోయాత్ర ప్రధాన కార్యదర్శుల నియామకం

నల్లగొండ: హాథ్‌సే హాథ్ జోడోయాత్ర నిర్వహణకు జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు ప్రధాన కార్యదర్శులను నియమించారు. ఈ మేరకు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. నల్లగొండకు ఎస్.ఆంజనేయులు గౌడ్, మిర్యాలగూడకు నగేష్, సాగర్, దేవరకొండ నియోజకవర్గాలకు ప్రేమ్‌లాల్, మునుగోడుకు బాలలక్ష్మి, నకిరేకల్ నియోజకవర్గానికి హరికృష్ణలను నియమించారు.

బియ్యం అమ్ముకుంటే కార్డు రద్దు : డీఎస్‌ఓ



అంగడిపేటలో రేషన్ షాపును తనిఖీ చేస్తున్న డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు

చండూరు: రేషన్ షాపుల్లో ఉచిత బియ్యం తీసుకొని దళారులకు అమ్ముకుంటే కార్డు రద్దు చేస్తామని డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. చండూరు మండలం అంగడిపేట గ్రామంలోని రేషన్ షాపును సోమవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేసి మాట్లాడారు. ఉచిత బియ్యం తీసుకొని ఇతరులకు అమ్ముకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయని.. కార్డుదారులపై నిఘా ఉంచామన్నారు. రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలన్నారు. షాపులను క్లీన్‌గా ఉంచాలన్నారు. జిల్లాలో 4,650 మెట్రిక్ టన్నుల బియ్యం సరాఫరా చేశామని అందులో, ఇప్పటి వరకు 70శాతం పైగా పంపిణీ పూర్తి కావొచ్చిందన్నారు. ఈనెల 23 తేదీ వరకు రేషన్ బియ్యం పంపిణీ చేస్తామన్నారు. ఆయన వెంట ఆర్ఐ (సీఎస్) డి.లింగస్వామి ఉన్నారు.

కనీస సామర్థ్యాలను పెంపొందించాలి

శాలిగౌరారం: విద్యార్థుల్లో కనీస సామర్థ్యాల పెంపునకు ఉపాధ్యాయులు కృషిచేయాలని డీఈఓ బొల్లారం భిక్షపతి అన్నారు. మండలంలోని వల్లాల గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను సోమవారం ఆకస్మికంగా తనఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సామర్థ్యాల సాధన రికార్డులు, రిపోర్టులు ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఎంఈఓ నాగయ్య, హెచ్‌ఎంలు ఉన్నారు.

క్రమబద్ధీకరణకు మోక్షం!

నందికొండ క్వార్టర్లలో నివాసితులకే ఇళ్లు కేటాయించేలా ప్రభుత్వం చర్యలు

- సూత్రప్రాయంగా వెల్లడించిన కలెక్టర్
- దరఖాస్తుదారులకు త్వరలోనే అందనున్న డిమాండ్ నోటీసులు
- కొలతల్లో హెచ్చుతగ్గులను పరిశీలించాలంటున్న లబ్ధిదారులు

నాగార్జునసాగర్: నందికొండలోని ప్రభుత్వ క్వార్టర్స్‌లో నివాసముంటూ దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఇళ్లను క్రమబద్ధీకరించేందుకు తెలంగాణ ప్రభుత్వం త్వరలో డిమాండ్ నోటీసులు పంపనుంది. ఈ మేరకు సర్కారు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ సూత్రప్రాయంగా వెల్లడించినట్లు సమాచారం. ఇప్పటికే క్రమబద్ధీకరణకు నోటీసులు ఇచ్చిన ఇళ్ల కొలతల్లో తేడాలు వచ్చి అధికంగా నగదు చెల్లించాల్సి ఉంటుందని..వాటిపై చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు పలు దరఖాస్తులు పెట్టుకున్నా జిల్లా అధికారులెవరూ స్పందించని పరిస్థితి. ఈ నేపథ్యంలో ఇప్పుడు ప్రభుత్వం స్పందించడంపై తమ నిరీక్షణ ఫలించనుందని లబ్ధిదారులు ఆనందం పడుతున్నారు.

గతంలోనే హామీ..

బతుకు దెరువు కోసం వచ్చి నాగార్జునసాగర్ ప్రాజెక్టు (నందికొండ)కాలనీలలోని ప్రభుత్వ క్వార్టర్లలో ఎన్నో ఏళ్లుగా నివాసముంటున్న (ఉద్యోగులు, ఉద్యోగేతరులైన వ్యాపారులు, కాంట్రాక్టర్లు, కూలీలు) వారికే ఇళ్లు కేటాయించే ఏర్పాటు చేస్తానని గతంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు హామీ ఇచ్చారు. హామీ మేరకు 58, 59 జీఓ ప్రకారం నివాసితులకు క్రమబద్ధీకరించేందుకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశమిచ్చారు. హిల్ కాలనీ, పైలాన్ కాలనీలో 1,468మంది దరఖాస్తులు పెట్టుకోగా 631మంది నివాసితులవి అంగీకరించారు. 837మందివి నిరాకరించారు. వీటిలో 576 ఇళ్లకు డిమాండ్ నోటీసులు పంపారు. మూడు దఫాల్లో నోటీసులో పంపిన విధంగా నగదును చాలానా రూపంలో చెల్లించాలని పేర్కొన్నారు. మూడు దఫాల్లో రూ.17,13, 90,307 చెల్లించాల్సి ఉండగా ఇప్పటి వరకు రూ.11,09,90,782 చెల్లించారు. రాష్ట్రంలోనే అత్యధికంగా నందికొండలోనే చెల్లించినట్లు సమాచారం. మొదటగా నోటీసులు వచ్చిన వారికి ఈ నెల 25 చివరి తేదీకాగా వెనుక దఫాలో వచ్చిన వారికి నోటీసులు పంపిన దగ్గరి నుంచి మూడు నెలలు గడువు ఇచ్చారు.



హిల్‌కాలనీ వ్యూ

లోయర్‌టైపు ఇళ్లకూ నోటీసులు!

ఇవే కాకుండా 2,766 లోయర్ టైపు క్వార్టర్లలో ఉంటున్న నివాసితులకే వాటిని క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు సమాచారం. 125 గజాల లోపు ఉంటే ఉచితంగా లేకుంటే వాటికి రేటు ప్రకారం నివాసితులకే విక్రయిస్తూ క్రమబద్ధీకరించనున్నట్లు సమాచారం.

పూర్తిగా చెల్లిస్తేనే రిజిస్ట్రేషన్లు



ప్రభుత్వం ఇచ్చిన డిమాండ్ నోటీసుల ప్రకారం చలానా రూపేనా నగదు పూర్తిగా చెల్లించిన వారికే ప్రభుత్వ ఖర్చులతో ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేస్తాం. మొదటి దఫాలో డిమాండ్ నోటీసులు తీసుకున్న వారు సుమారుగా రూ.6కోట్లకు పైచిలుకే చెల్లించాల్సి ఉంది. వీటిని త్వరగా చెల్లించాలి.

– సైదులుగౌడ్, తహసీల్దార్

కొలతల్లో తేడాలను పరిశీలించాలి



కొలతల్లో తేడాలతో రెండో దఫాలో రూ.60వేలకు పైచిలుకు అధికంగా చెల్లించాం. మాది 'ఏ' టైపు నంబర్ 140 ఇల్లు. ఇంటి స్థలం 394 గజాలు ఉండగా 566.9 గజాలు పడింది. రూ.5,32,000లు చెల్లించాలని డిమాండ్ నోటీసు పంపారు. ఇప్పటికే రూ.3,72,400లు చెల్లించాం. కొలతల్లో తేడాలను పరిశీలించి మా సమస్యను పరిష్కరించండి.

– పోలగాని ఉపేంద్ర, పైలాన్‌కాలనీ, లబ్ధిదారురాలు

నిరాకరించిన ఇళ్లకు త్వరలోనే..

నందికొండ వాసులందరి సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంలో భాగంగా కోర్టు కేసులు లేనివారికి నోటీసులు ఇవ్వనున్నట్టు తెలిసింది. 2014 తర్వాత అలాట్‌మెంట్ ఉన్నవాటిని కూడా పరిగణనలోకి తీసుకునేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే గతంలో దరఖాస్తు చేసుకోని వారికి మరోసారి అవకాశమివ్వాలని, అలాట్‌మెంట్ లేకుండా ఏళ్ల తరబడి అదే ఇంట్లో ఉంటూ తగాదాలు లేనివారి ఇళ్లను వా రికే క్రమబద్ధీకరించాలని స్థానికులు కోరుతున్నారు.

ఉచిత విద్యుత్ ఘనత తెలంగాణదే..



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు

- విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి
- రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి పదవీ బాధ్యతల స్వీకారానికి హాజరు

నల్లగొండ టౌన్: దేశంలో వ్యవసాయానికి 24 గంటల పాటు ఉచిత విద్యుత్‌ను ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండలోని జిల్లా వ్యవసాయ కార్యాలయంలో జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడిగా నియమితులైన చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పదవీ బాధ్యత స్వీకార కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 2014 సంవత్సరానికి ముందు తెలంగాణలో వ్యవసాయరంగం అగమ్యగోచరంగా ఉండన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన ఆరు నెలల్లోనే విద్యుత్ సమస్యకు సీఎం కేసీఆర్ పరిష్కారం చూపారన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ అంటున్న ప్రధాని మోదీ తన సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో కూడా రైతులకు ఇప్పటికే 7 గంటల విద్యుత్‌ను ఇవ్వడం లేదన్నారు. గుజరాత్‌లో వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టిన ఘనుడు నరేంద్రమోదీ అని విమర్శించారు. తెలంగాణలో కరెంట్ కోతలు తెచ్చేలా నరేంద్రమోదీ అండ్ గ్యాంగ్ కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల చేస్తున్న అసత్య ప్రచారాన్ని రైతులు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసుకుని ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ నంబర్‌వన్ స్థానానికి చేరుకుందన్నారు. రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో రైతుల ఆత్మహత్యలు లేని రాష్ట్రంగా తెలంగాణ మారిందన్నారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతు సంక్షేమ పథకాలతో వ్యవసారంగం పండుగలా మారి రైతులు సంతోషంగా ఉన్నారన్నారు. ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని సుభిక్షంగా మార్చిన కేసీఆర్‌కు రైతులు అండగా నిలవాలని కోరారు. రైతుబంధు సమితి అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టిన చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రైతుబిడ్డగా రైతుల సంక్షేమానికి పాల్పడతానని పేర్కొన్నారు. తాను రైతుబంధు సమితి అధ్యక్షుడు కావడానికి కృషి చేసిన మంత్రితో పాటు ఎంపీ, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర పార్టీ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్ రెడ్డి, గాదరి కిషోర్‌కుమార్, చిరుమర్తి లింగయ్య, ఎన్.భాస్కర్‌రావు, రవీంద్రకుమార్, ఆగ్రోస్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, షీప్ కార్పొరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, డీఏఓ వై.సుచరిత తదితరులు పాల్గొన్నారు.



పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో మంత్రి, ఇతర ప్రజాప్రతినిధులు

భూ సేకరణ వేగవంతం చేయాలి

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

నల్లగొండ: దేవరకొండ నియోజకవర్గంలోని ఏఎమ్మార్ ప్రాజెక్టు, డిండి ఎత్తిపోతల పథకం కింద నిర్మిస్తున్న రిజర్వాయర్లకు సంబంధించిన భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్‌తో భూ సేకరణ, ఆర్ అండ్ ఆర్ నిర్మాణ పనులపై సమీక్షించారు. పోడు భూముల సమస్యలపై కూడా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లింపు చేయాలని, ఆర్ అండ్ ఆర్ పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రాజ్‌కుమార్, రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయాలి

నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమం కింద చేపట్టిన పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ భాస్కర్ రావుతో కలిసి ఎంపీడీఓలు, ఇంజనీరింగ్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో పలు అంశాలపై సమీక్షించారు. నియోజక వర్గ అభివృద్ధి నిధులతో ఇంకా ప్రారంభించని పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. ఇప్పటికే పూర్తి చేసిన పనులకు సంబంధించి బిల్లులు, వినియోగిత ధ్రువీకరణ చేసి వెంటనే పంపించాలని సూచించారు. ప్రతి బుధవారం ఎంపీడీఓలు సమావేశం నిర్వహించి ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీలతో సమీక్షించాలని ఆదేశించారు. తక్కువ సమయంలో పెరిగే మొక్కలను నర్సరీల్లో పెంచాలన్నారు. ఎక్కువ మంది కూలీలకు ఉపాధి పనులు కల్పించేందుకు ఎంపీడీఓలు చొరవ తీసుకోవాలన్నారు.పనులు చేపట్టే చోట పనుల వివరాలతో వర్క్ బోర్డ్‌లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి బాలశౌరి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

ప్రజా ఫిర్యాదులను పెండింగ్ ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. సోమవారం నల్ల గొండ కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ భాస్కర్‌రావుతో కలిసి నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి వినతులను స్వీకరించి మాట్లాడారు. ప్రజావాణిలో వివిధ సమస్యలపై మొత్తం 55 ఫిర్యాదులు వచ్చాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీఎం శ్రీనివాసులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

చెర్వుగట్టులో లక్ష పుష్పార్చన

నార్కట్‌పల్లి: మండలంలోని చెర్వుగట్టు గ్రామంలో గల శ్రీపార్వతి జడలరామలింగేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అమవాస్య కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి రావడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవాలయ శాఖ సిబ్బంది, పోలీసులు తగిన ఏర్పాట్లు చేశారు. పూజా కార్యక్రమంలో ఆలయ ఈఓ నవీన్, ప్రధాన అర్చకుడు రామలింగేశ్వరశర్మ, అర్చకులు సతీష్ శర్మ, సురేష్ శర్మ, శ్రీకాంత్ శర్మ పాల్గొన్నారు.



లక్ష పుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకులు

రేపటి నుంచి నట్టల నివారణ మందు పంపిణీ

నల్లగొండ టౌన్ : జిల్లాలో బుధవారం నుంచి 28వ తేదీ వరకు గొర్రెలు, మేకలకు నట్టల మందును తాగించే కార్యక్రమాన్ని నిర్వహించేందుకు జిల్లా పశుసంవర్ధక శాఖ సిద్ధమైంది. జిల్లా వ్యాప్తంగా 3లక్షల 40వేల మేకలు, 11లక్షల 16 వేల గొర్రెలు ఉన్నట్లు ఆ శాఖ గణాంకాలు చెపుతున్నాయి. వీటన్నింటికి నట్టల మందును తాగించడానికి జిల్లా పశుసంవర్ధక శాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది.

పశు వైద్యశాలలకు చేరిన మందు

ఇప్పటికే జిల్లాకు అవసరమైన నట్టల మందును తెప్పించి అని పశువైద్య శాలలకు పంపించారు. ప్రతి సంవత్సరం జీవాలకు నాలుగు విడతలుగా నట్టల మందును తాగించే కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. జీవాల్లో మరణాల శాతాన్ని తగ్గించేందుకు ప్రతి మూడు నెలలకు ఒకసారి నట్టల మందును తాగిస్తున్నారు. దీంట్లో భాగంగా ఈ సారి కూడా కార్యాచరణ రూపొందించారు. రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జీవాల మందల వద్దకు వెళ్లి మందును తాగించనున్నారు. ఇందుకు అవసరమైన 105 బృందాలను ఏర్పాటు చేశారు. ప్రతి పెంపకం దారుడు పశువైద్య సిబ్బందికి సహకరించి తమ జీవాలకు నట్టల మందు తాగించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ అంబటి యాదగిరి విజ్ఞప్తి చేస్తున్నారు.

'ఫార్మా' అనుమతులు రద్దయ్యేనా?

- కిష్టాపురంలో సాగుతున్న కంపెనీ నిర్మాణ పనులు
- ఈ ప్రాంత ప్రజలకు పొంచి ఉన్న కాలుష్యం ముప్పు
- అనుమతులు రద్దు చేయాలని ప్రజల పోరుబాట
- నేడు కలెక్టరేట్‌కు వచ్చేందుకు సిద్ధమైన అఖిలపక్ష నాయకులు

మునుగోడు: ఒకపక్క సాగునీటి వనరులు లేక.. మరోపక్క ఫ్లోరైడ్ సమస్యతో సతమతమవుతున్న మునుగోడు ప్రజలకు కాలుష్య ముప్పు తప్పేలా కనిపించడం లేదు. తమ ప్రాంతంలో ఫ్లోరైడ్ సమస్య పరిష్కారానికి నీటి ప్రాజెక్టులు నిర్మించాలని ఎన్నో ఏళ్లుగా పోరాడుతున్నారు. దీంతో నియోజకవర్గ పరిధిలో కిష్టరాయిన్‌పల్లి, చర్లగూడెం రిజర్వాయర్లు నిర్మాణం అవుతున్నాయి. ఈ తరుణంలో మునుగోడు మండలం కిష్టాపురం శివారులో ఓ ఫార్మా కంపెనీ ఏర్పాటవుతుండడం భయాందోళన కలిగిస్తోంది. ఇప్పటి వరకు హైదరాబాద్ సమీపంలోని చౌటుప్పల్ ప్రాంతానికే పరిమితమైన ఫార్మా కంపెనీలు ఇప్పుడు గ్రామాల మధ్యలో ఏర్పాటు చేస్తుండటంతో ఆ కంపెనీ నుంచి వచ్చే వ్యర్థ రసాయనాలతో భూగర్భ జలాలు కలుషితమవుతాయని ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఈ ఫార్మా కంపెనీ అనుమతులను రద్దు చేయాలని అన్ని పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు కొన్ని రోజులుగా ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దీంతో ఆ కంపెనీ అనుమతులను రద్దు చేస్తారో లేదోనన్న అనుమానాలు ప్రతిఒక్కరిలో రేకెత్తుతున్నాయి.



మునుగోడు మండలం కిష్టాపురం సమీపంలో నిర్మాణ దశలో ఉన్న సన్‌లైట్ ఫార్మా కంపెనీ


ఫార్మా వ్యతిరేక పోరాట కమిటీ ఏర్పాటు చేసి..

మండలంలోని కిష్టాపురంలోని సర్వేనంబర్ 356, 357లోని రెండు ఎకరాల భూమిలో సన్‌లైట్ ఆక్టివ్ డ్రగ్ ఇంగ్రిడియంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఫార్మా కంపెనీ ఏర్పాటుకు మూడు నెలల క్రితం పనులు ప్రారంభించారు. దీన్ని నిర్మిస్తే చుట్టుపక్కల దాదాపు 20 గ్రామాలకు పైగా కాలుష్యం బారిన పడతాయి. అంతేకాకుండా మునుగోడు పెద్దవాగు నీరంతా కలుషితమయ్యే ప్రమాదం ఉటుంది. ఫలితంగా ఈ ప్రాంతంలో పంటలు కూడా సక్రమంగా పండే పరిస్థితి ఉండదు. ప్రజలు సైతం రోగాల బారిన పడే ముప్పు పొంచి ఉంది. ఈ నేపథ్యంలో అన్ని పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు ఏకతాటిపైకి వచ్చి 10 రోజుల క్రితం ఫార్మా వ్యతిరేక పోరాట కమిటీ ఏర్పాటు చేశారు. దీంట్లో భాగంగా ఫార్మా కంపెనీ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఇటీవల మునుగోడులో అఖిలపక్ష నాయకులు భారీ ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో మంగళవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫార్మా అనుమతులు రద్దు చేయాలని కోరేందుకు అఖిల పక్ష నాయకులు సిద్ధమవుతున్నారు.

అధికార పార్టీ ప్రజాప్రతినిధులు సైతం..

ఫార్మా కంపెనీ ఏర్పాటైతే మండలంలో కాలుష్య ముప్పు నెలకొంటుందని, తమకు పార్టీల కంటే ప్రజారోగ్యమే ముఖ్యమని అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు సైతం ఆందోళన బాట పడుతున్నారు. గతంలో నియోజకవర్గ పరిధిలోని గట్టుప్పల గ్రామ శివారులో నిర్మిస్తున్న క్రాంతి ఫార్మా లేబరేటరీస్ కంపెనీని రద్దు చేయాలని అఖిల పక్షం ఆందోళన చేస్తే ఇందులో టీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కేటీఆర్ నెల రోజుల క్రితం గట్టుప్పల మండల కేంద్రానికి వచ్చిన సందర్భంలో క్రాంతి కంపెనీ అనుమతి రద్దు చేయాలని కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. అదే మాదిరిగా మునుగోడు మండలం కిష్టాపురంలో నిర్మిస్తున్న సన్‌లైట్ కంపెనీ అనుమతులను రద్దు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అనుమతులు రద్దు చేయాలి



ప్రజారోగ్యం, పంటలకు హాని కలిగించే ఫార్మా కంపెనీ అనుమతులు వెంటనే రద్దు చేయాలి. ప్రజల డిమాండ్‌పై ప్రభుత్వం వెంటనే స్పందించాలి. లేదంటే అఖిలపక్షం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు కొనసాగిస్తాం.

– నెల్లికంటి సత్యం, సీపీఐ జిల్లా కార్యదర్శి, నల్ల గొండ

ప్రజాభిప్రాయాలను గౌరవించాలి



ఏ ప్రభుత్వమైనా ప్రజాభిప్రాయాలను గౌరవిస్తూ పనిచేయాలి. ఫార్మా కంపెనీలతో ప్రజలకు ఇబ్బంది ఉంటుందని తెలిసి అనుమతి ఇవ్వడం సరైంది కాదు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేసి కిష్టాపురంలో ఇచ్చిన ఫార్మా అనుమతులు రద్దు చేయాలి.

– పున్న కైలాస్ నేత, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి

అనుమతుల రద్దుకు కృషి చేస్తా..



ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారే ఫార్మా కంపెనీ అనుమతుల రద్దుకు నా శాయశక్తులా కృషిచేస్తా. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే సహకారంతో మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డిలల దృష్టికి తీసుకెళ్తా. ఇటీవల జరిగిన సర్వసభ్య సమావేశంలో కూడా తీర్మానం చేశాం.

– కర్నాటి స్వామి, ఎంపీపీ, మునుగోడు

బ్రహ్మోత్సవ శోభ

విద్యుత్ వెలుగుల్లో యాదాద్రి ప్రధానాలయం



- నేటి నుంచి యాదాద్రి వార్షిక బ్రహ్మోత్సవాలు
- ఉదయం 10 గంటలకు ప్రారంభం
- ముస్తాబైన ప్రధానాలయం

యాదగిరిగుట్ట : అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడిగా.. స్తంభోద్భవుడిగా విరాజిల్లుతున్న యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రం వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. స్వస్తి శ్రీ శుభకృత్ నామ సంవత్సరం ఫాల్గుణ శుద్ధ పాడ్యమి రోజు మంగళవారం నుంచి ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. మార్చి 3వ తేదీన ఫాల్గుణ శుద్ధ ఏకాదశి శుక్రవారం రోజున శృంగార డోలోత్సవంతో పరిసమాప్తం కానున్నాయి. ఆలయ పునర్నిర్మాణం నేపథ్యంలో ఆరేళ్ల పాటు బాలాలయంలో బ్రహ్మోత్సవాలు జరిగాయి. ఈసారి కొండపై శ్రీస్వామి సన్నిధిలో వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలు, అరటి, మామిడి తోరణాలు, పూలతో అలంకరించారు. ఘాట్ రోడ్డు ఆలయ పరిసరాల్లో విద్యుత్ లైట్‌లు వేశారు. యాదగిరిగుట్ట పట్టణంలోనూ శ్రీస్వామి, అమ్మవారి ఆర్చిలను ఏర్పాటు చేశారు.

విశ్వక్సేన ఆరాధనతో..

బ్రహ్మోత్సవాలు మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రధానాలయంలో శ్రీవిశ్వక్సేన ఆరాధన, స్వస్తివాచనం, రక్షాబంధనంతో ప్రధానాలయంలో మొదలుకానున్నాయి. మార్చి 3న ఉదయం అష్టోత్తర శతఘటాభిషేకం, రాత్రి 9 గంటలకు శ్రీస్వామి వారి శృంగార డోలోత్సవంతో పరిసమాప్తం కానున్నాయి. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టాలైన శ్రీస్వామి, అమ్మవార్ల ఎదుర్కోలు ఉత్సవం 27న, తిరు కల్యాణం 28న, దివ్య విమాన రథోత్సవం మార్చి1న నిర్వహించనున్నారు. 23వ తేదీ నుంచి అలంకార, వాహన సేవలకు ఆచార్యులు శ్రీకారం చుడతారు.

సాంస్కృతిక కార్యక్రమాలు

బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక, ఆహ్లాదం పంచేందుకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉదయం 9నుంచి రాత్రి 10గంటల వరకు కొండపైన, వీఐపీ పార్కింగ్ వద్ద ఆలయం ఆధ్వర్యంలో, సాయంత్రం 6నుంచి 9గంటల వరకు బ్రహ్మోత్సవ మండపం వద్ద వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్‌రావు ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన వేదికలను సిద్ధం చేస్తున్నారు.

ప్రథమ ప్రాకార మండపంలో సేవల అలంకరణ

బ్రహ్మోత్సవాల్లో ప్రధానమైనవి అలంకార, వాహన సేవలు. ప్రథమ ప్రాకారంలోని ఉత్తర దిశలో ఉన్న మండపంలో శ్రీస్వామి వారిని అలంకరించి సేవలను ఉత్తర రాజగోపురం నుంచి మాఢ వీధుల్లో ఊరేగిస్తారు. తూర్పు రాజగోపురం ఎదుట ఏర్పాటు చేసే వేదిక వద్ద శ్రీస్వామి వారి అలంకార సేవను అధిష్టింపజేసి ఆచార్యులు, పారాయణీకులు, రుత్వికులు పారాయణాలు పఠిస్తారు. అదే విధంగా అద్దాల మండపం ఎదుట యాగశాల ఏర్పాటు చేస్తున్నారు.

క్లుప్తంగా

భక్తులకు అనుగుణంగా బస్సులు

యాదగిరిగుట్ట : యాదాద్రి వార్షిక బ్రహ్మోత్సవాల నేపథ్యంలో జంట నగరాల నుంచి యాదగిరిగుట్టకు వచ్చే భక్తులకు బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని డిపో మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడారు. జంట నగరాల భక్తుల కోసం ఉప్పల్ క్రాస్ రోడ్డు నుంచి నేరుగా యాదాద్రి రింగ్ రోడ్డులోని నూతన బస్టాండ్ వరకు బస్సులను భక్తులకు అనుగుణంగా ప్రతి 15 నిమిషాలకు ఒకటి నడిపిస్తామన్నారు. ఇక బ్రహ్మోత్సవాలకు ప్రత్యేకంగా శ్రీశైలం, వేములవాడ, కొమురవెల్లి ప్రాంతాల నుంచి బస్సులను నడిపించనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం 83 బస్సులు యాదగిరిగుట్ట డిపో పరిధిలో నడుస్తున్నాయని, వీలైనంత వరకు భక్తులకు ఇబ్బందులు లేకుండానే బస్సులను నడిపిస్తామన్నారు. ఇక రింగ్‌రోడ్డులోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి కొండపైకి నిత్యం బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రధాన ఘట్టాలైన ఎదుర్కోలు, తిరు కల్యాణం, రథోత్సవం రోజు ప్రతి 10 నిమిషాలకు ఒక్క బస్సును నడిపే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. తీర్థ జనులకు ఆర్టీసీ పక్షాన మెరుగైన ప్రయాణ సౌకర్యాలు కల్పిస్తామన్నారు.

లక్ష్మీ సదన్‌లో అర్చకులకు బస సౌకర్యం

- దీక్షాపరుల మండపంలో కళాకారులకు భోజన వసతి ఏర్పాటు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చే అర్చకులు, రుత్వికులు, పారాయణీకులకు తులసీ కాటేజీలోని లక్ష్మీ సదన్‌లో బస చేసేందుకు ఆలయాధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా లక్ష్మీ సదన్‌లో ఉన్న గదులను 100 మంది బస చేసే విధంగా శుభ్రం చేశారు. 11 రోజుల పాటు ఈ లక్ష్మీ సదన్‌లోనే ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన అర్చక స్వాములు, పారాయణీకులు, రుత్వికులు, యాజ్ఞీకులు ఉండనున్నారు. ఇక కళాకారులకు దీక్షాపరుల మండపంలో భోజన వసతి ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే ఇందులో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీక్షాపరుల మండపంలో ఒక భాగం మిగిలి ఉండటంతో కళాకారులకు ఇందులోనే భోజన వసతి కల్పించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు.

ముగిసిన పోలీస్ ఈవెంట్స్



షార్ట్‌పుట్ విసురుతున్న అభ్యర్థులు

నల్లగొండ క్రైం: పోలీస్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో భాగంగా నల్లగొండ పట్టణంలోని మేకల అభినవ్ స్టేడియంలో ఈ నెల 15 నుంచి నిర్వహించిన దేహదారుఢ్య పరీక్షలు సోమవారం ముగిశాయి. జిల్లా మొత్తంగా 4,049 మంది హాజరుకాగా 1,252 మంది అర్హత సాధించారు. అధిక శాతం మంది అభ్యర్థులు రన్నింగ్‌లోనే అర్హత కోల్పోయారు. గ్రామీణ నేపథ్యం ఉన్న అభ్యర్థులు రన్నింగ్, లాంగ్ జంప్‌లో సులభంగా అర్హత సాధించారు. చివరి రోజు 848 మందికి గాను 718 మంది పాల్గొనగా 206 మంది అర్హత సాధించారు. ఈవెంట్స్‌ను జిల్లా ఎస్పీ అపూర్వరావు పర్యవేక్షించారు. పారదర్శకంగా, ప్రశాంతంగా ఈవెంట్స్ నిర్వహించామని ఎస్పీ తెలిపారు.

గుహల్లో కొలువై.. భక్తులకు నెలవై

- యాదవ మహర్షి తపస్సుతో యాదాద్రిపై కొలువుదీరిన నృసింహుడు

యాదగిరిగుట్ట: ఎక్కడైనా నరసింహుడు రాతి గుహల్లో.. అటవీ ప్రాంతాల్లో ఉండేందుకే ఇష్టపడతాడు. అందుకే ఆ స్వామిని 'మృగ నరహరి' అని కూడా పిలుస్తారు. అహోబిలంలో హిరణ్యకశిపుడిని వధించిన తర్వాత నృసింహుడు అడవుల్లో సంచరిస్తుండగా ఆయనను శాంతింపజేయాలని బ్రహ్మాది దేవతలు లక్ష్మీదేవిని వేడుకుంటారు. దీంతో అమ్మవారు చెంచు లక్ష్మీగా యాదాద్రి ప్రాంతంలో అవతరించి నరహరిని శాంతింపజేసిందని పురాణాలు చెబుతున్నాయి. హిరణ్యకశిపుడిని చీల్చి చండాడిన నృసింహుడి చేతులు ఆదిమహాలక్ష్మిని మాత్రం అతి సున్నితంగా అక్కున చేర్చుకున్నాయి. అంతేకాకుండా యాదవ మహర్షి తపస్సుతో సింహరూపుడు పంచరూపాలతో సాక్షాత్కరించి స్వయంభుగా వెలిశారని ఈ యాదాద్రి క్షేత్రం చరిత్ర చెబుతోంది. రుష్యారాధన క్షేత్రంగానూ యాదాద్రి విరాజిల్లుతోంది. సృష్టి కర్త బ్రహ్మకే ఆయువు పోసిన బ్రహ్మాండనాయకుడు నృసింహుడని పురాణాలు ఘోషిస్తున్నాయి. నరసింహుడిని దర్శించుకున్న సృష్టికర్త బ్రహ్మ 'ఉగ్రం వీరం మహా విష్ణుం.. జ్వలంతం సర్వతో ముఖం.. నృసింహం భీషణం భద్రం.. మృత్యు మృత్యుం సమామ్యహం' అంటూ సృష్టి కార్యాన్ని ప్రారంభించాడని పండితులు చెబుతుంటారు.

పురాణాల పరంగా..

యాదాద్రికి సంబంధించి ఎన్నో ఇతిహాసాలు, రామాయణ మహాకావ్యంలోనూ ప్రస్తావనలున్నాయి. మహాజ్ఞాని విభాండకుడి కుమారుడు రుష్యశృంగుడు, అతడి పుత్రుడైన యాద మహర్షి తపోశక్తితోనే యాదగిరిగుట్ట వెలసిందంటారు. యాదుడు బాల్యం నుంచి మహావిష్ణు భక్తుడు. దేవదేవుడిని తిలకించాలన్న తపన నానాటికి పెరిగింది. అందులోనూ ఉగ్రరూపుడైన నృసింహావతారం పట్ల ఎనలేని మక్కువ కలిగింది. దైవసాక్షాత్కారం కోసం దట్టమైన అడవుల్లో తిరుగుతూ కొండజాతికి చిక్కాడు. ఆటవికులు యాదుడిని క్షుద్ర దేవతలకు బలి ఇవ్వబోతుండగా ఆంజనేయుడు ప్రత్యక్షమైనట్లు పురాణాలు చెబుతున్నాయి. కీకారణ్యంలో సింహాకార గుట్టలు ఉన్నాయని, అక్కడికి వెళ్లి తపస్సు చేస్తే స్వామి సాక్షాత్కరిస్తాడని యాదుడికి ఆంజనేయుడు సూచిస్తాడు. యాదుడి దీర్ఘకాలిక తపస్సుతో స్తంబోద్భవుడు తొలుత జ్వాలా, గంధబేరుండ, యోగానంద, ఉగ్రసింహ, శ్రీలక్ష్మీ సమేతుడిగా (పంచరూపాలతో) యాదాద్రి గుహలోనే కొలువై ఉండడంతో ఈ క్షేత్రం పంచనారసింహ నిలయంగా పురాణాలకెక్కింది. యాద రుషి కోరిక ఫలితంగా వెలసిన క్షేత్రం యాదగిరిగుట్టగా ప్రసిద్ధి చెందింది.

రక్షణగా సుదర్శన చక్రం..

తపోముద్రలో ఉన్న యాద మహర్షిని మింగేయాలని ప్రయత్నించిన ఒక రాక్షసుడిని మరుక్షణమే విష్ణుమూర్తి సుదర్శన చక్రం అడ్డుకుని వధించిందని, అప్పటి నుంచి గుట్ట చుట్టూ సుదర్శన చక్రం రక్షా కవచంగా నిలిచి ఉంటుందని భక్తుల అపార విశ్వాసం. స్వామి పుష్కరిణి సాక్షాత్తూ బ్రహ్మ కడిగిన పాదాల నుంచే పుట్టిందంటారు. ఈ పుష్కరిణిలో పుణ్యస్నానం ఆచరిస్తే శారీరక రుగ్మతలు, గ్రహ బాధల నుంచి విముక్తి కలుగుతుందని అంటుంటారు. ఎంతో కాలం మరుగున పడిపోయిన ఈ క్షేత్ర మహాత్యాన్ని స్థానిక గ్రామాధికారి కలలో స్వామి కనిపించి తన అవతార రహస్యాన్ని చెప్పాడని పురాణాల్లో ఉంది. హైదరాబాద్ వాస్తవ్యులు రాజామోతీలాల్ 1920లో ఆలయాన్ని నిర్మించి పూజాధి కార్యక్రమాలు పునరుద్ధరించారని చరిత్ర చెబుతోంది. ఆయన హయాంలోనే పాంచరాత్ర ఆగమ శాస్త్ర విధానంతో పూజలు మొదలయ్యాయి.

- నాడు భక్తోత్సవాలు.. నేడు బ్రహ్మోత్సవాలు



పూర్వం భక్తోత్సవాలు నిర్వహిస్తున్న ఆచార్యులు (ఫైల్)



పూర్వం యాదాద్రి ఆలయానికి వెళ్లే ఘాట్ రోడ్డు (ఫైల్)

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వాతంత్ర్యం ముందు స్థానికులు మూడురోజులు భక్తోత్సవాలు నిర్వహించేవారు. స్వాతంత్ర్యం అనంతరం 1955లో తొలిసారి 11రోజుల పాటు బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. అప్పట్లో యాదాద్రి కొండ పైకి మెట్ల దారి కూడా అంతంతమాత్రంగానే ఉండేది. అయినప్పటికీ ఈ ప్రాంతవాసులు ఎలాగో అలా కొండెక్కి మూడు రోజుల పాటు భక్తోత్సవాలు నిర్వహించేవారు. అప్పట్లో భక్తులు నిర్వహించేవారు కాబట్టి.. వాటిని భక్తోత్సవాలనేవారు. కొన్నేళ్ల తర్వాత ఈ భక్తోత్సవాలను ఐదు రోజులకు పెంచారు. మార్గశిర మాసంలో ఆ సంబురాలు జరిగేవి. అయితే మార్గశిర మాసంలో స్వామి వారి ఉత్సవాలు జరపడం సబబుకాదంటూ అప్పట్లోనే పూజారులు కొందరు ఫాల్గుణ మాసంలో 11 రోజుల పాటు ఉత్సవాల నిర్వహణకు ప్రణాళికలు రూపొందించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాడ్డాక అప్పటి ఆలయ కమిటీ పెద్దలు ఆచార్యులతో సంప్రదించి 1955లో 11 రోజుల బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. నాటి నుంచి స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి.

పోచంపల్లిని సందర్శించిన పూణె విద్యార్థులు



పోచంపల్లిలో చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న విద్యార్థులు

భూదాన్‌పోచంపల్లి: చేనేత కార్మికుల స్థితిగతులను అధ్యయనం చేయడానికి సోమవారం మహారాష్ట్రలోని పూణెలోని ఫ్లేమ్ యూనివర్సిటీకి చెందిన 13 మంది విద్యార్థులు పోచంపల్లిని సందర్శించారు. చేనేత గృహాలకు వెళ్లి చేనేత వస్త్రాల తయారీ విధానాలను తెలుసుకొన్నారు. మగ్గం నేయడం ద్వారా ఎంత ఆదాయం వస్తుంది, వస్త్రాలను ఎక్కడ మార్కెటింగ్ చేస్తారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత కార్మికుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను అడిగి తెలుసుకొన్నారు. అనంతరం చేనేత సహకార సంఘాన్ని సందర్శించి అక్కడ ఇక్కత్ వస్త్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ అధ్యాపకులు రాజ్‌సీనా, ఫారుఖ్ మాట్లాడుతూ.. యూనివర్సిటీలో కమ్యూనికేషన్స్ అండ్ ఫైనాన్స్ కోర్సును చదువుతున్న సెకండర్ ఇయర్ విద్యార్థులు 'డిస్కవరీ ఇండియా' అనే కార్యక్రమంలో భాగంగా పోచంపల్లి సందర్శనకు వచ్చారని పేర్కొన్నారు. ఇండియాలోని వివిధ ప్రాంతాల ప్రజల జీవన విధానాలు, సంస్కృతిని అధ్యయనం చేస్తున్నామని అన్నారు. అందులో భాగంగానే అంతర్జాతీయంగా పేరుగాంచిన పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలు, ఇక్కడి చేనేత కళాకారుల జీవన స్థితిగతులను తెలుసుకోవడానికి వచ్చామని తెలిపారు. అధ్యయనం చేసిన అంశాలపై డాక్యుమెంటరీని కూడా రూపొందిస్తామని అన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వరరెడ్డి

మునగాల(కోదాడ): హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం మునగాల సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కోదాడ డీఎస్పీ కేసు వివరాలు వెల్లడించారు. మండలంలోని నేలమర్రి గ్రామానికి చెందిన బచ్చలకూర మదార్(50) ట్రాక్టర్ డ్రైవర్. ఇదే గ్రామానికి చెందిన బచ్చలకూర సంజీవ కూడా ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా సంజీవ సొంత బాబాయి భార్య రామాంజమ్మతో మదార్ సన్నిహితంగా ఉంటున్నాడు. ఈ విషయమై పలుమార్లు సంజీవ రామాంజమ్మతో పాటు మదార్‌ను మందలించినప్పటికీ వినలేదు. దీంతో మదార్‌ను అంతమొందించాలనే నిర్ణయానికి వచ్చాడు. ఈ నెల 16న రాత్రి గ్రామంలోని చర్చి బజారు నుంచి వస్తున్న మదార్‌ను సంజీవ కర్రతో వెంబడించి సమీపంలోని పశువుల కొట్టంలో పట్టుకుని దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన మదార్‌ను కుటుంబ సభ్యులు సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మరుసటి రోజు మృతిచెందాడు. హతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిని సోమవారం గ్రామంలోనే అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ వివరించారు. సమావేశంలో మునగాల సీఐ ఆంజనేయులు, ఎస్‌ఐ లోకేష్ పాల్గొన్నారు.

కొండమడుగు పీహెచ్‌సీకి నేషనల్ హెల్త్ మిషన్ సర్టిఫికెట్

బీబీనగర్: యాదాద్రి జిల్లా బీబీనగర్ మండలంలోని కొండమడుగు గ్రామంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్) జాతీయ నాణ్యత ప్రమాణాల విభాగంలో నేషనల్ హెల్త్ మిషన్ సర్టిఫికెట్‌ను సాధించింది. కొండమడుగు పీహెచ్‌సీని గత డిసెంబర్ నెలలో జాతీయ నాణ్యత ప్రమాణాల బృందం సభ్యులు సందర్శించి ఆస్పత్రిలో ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను, కల్పిస్తున్న వసతులను పరిశీలించారు. అదేవిధంగా పీహెచ్‌సీలోని రికార్డులు, రిజిస్టర్ల నమోదు, ల్యాబ్ సేవలను పరిశీలించారు. ఆస్పత్రి పట్ల అక్కడి రోగుల అభిప్రాయాలను బృందం సభ్యులు పరిగణలోకి తీసుకున్నారు. దీంతో నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్‌లో 94.4శాతం మార్కులు సాధించడంతో పాటు నేషనల్ హెల్త్ మిషన్ సర్టిఫికెట్‌ను సాధించి యాదాద్రి జిల్లాలో ఉత్తమ పీహెచ్‌సీగా పేరు తెచ్చుకుంది. సర్టిఫికెట్‌ను సాధించిన ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం అభివృద్ధికి రూ.3లక్షల నగదు పారితోషికం అందనున్నట్లు సమాచారం. జిల్లాలోని మొత్తం 21పీహెచ్‌సీలో 9పీహెచ్‌సీలు 2021 నుంచి ఇప్పటి వరకు జాతీయ హెల్త్ మిషన్ సర్టిఫికెట్లను సాధించినట్లు సమాచారం. కొండమడుగు పీహెచ్‌సీ నేషనల్ హెల్త్ మిషన్ సర్టిఫికెట్‌ను సాధించడం పట్ల జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ ఆస్పత్రి వైద్యులు, సిబ్బందిని అభినందించారు.

ప్రకటన
మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్ట్, మిర్యాలగూడ నందు
యస్.ఓ.పి. నెంబర్ 5 / 2022
మధ్యన :
1) కొండేటి ప్రవల్లిక
2) కొండేటి మల్లిఖార్జున్ మైనర్లు అయినందున వారి తరపున వారి పెద్దమ్మ అయిన కొండేటి ఈశ్వరమ్మ
నివాసము : ఇంటి నెం. 1-100, పెద్ద దేవులపల్లి, గ్రామము, త్రిపురారం మండలం, నల్లగొండ జిల్లా.
...పిటీషనర్స్
మరియు
1) సుధా కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్ తరపున బ్రాంచ్ మేనేజర్, మిర్యాలగూడ మరియు ఎవరికి సంబంధించితే వారు.
...రెస్పాండెంట్స్
పైన తెలిపిన ఓపి లో పిటీషనర్స్ తల్లి కొండేటి తిరుపతమ్మ మరియు తండ్రి కొండేటి మట్టయ్య ఇరువురు చనిపోయినందున వారి యొక్క వారసత్వ ధృవీకరణ కొరకు కోర్టులో కేసు వేసినారు. ఇట్టి కేసు తేది. 01-03-2023 నాడు వాయిదా కలదు. ఇట్టి కేసు వారసత్వ ధృవీకరణ పత్రము పిటీషనర్స్‌కు జారీ చేయుటకు ఎవరికైనా, ఏమేని అభ్యంతరం ఉన్న యెడల మీరు ప్రత్యక్షంగా కాని, వకీలు ద్వారా కాని తేది.01-03-2023 నాడు ఉదయం 10.30 గంటలకు పై కోర్ట్ యందు హాజరై ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల తెలుపుకొనగలరు. లేని పక్షములో పై పిటీషనర్స్ పక్షాన కోర్ట్ వారు తీర్పుగా గావించెదరు.
// కోర్ట్ వారి అనుమతితో //
స్థలం: మిర్యాలగూడ.
తేది.21-02-2023
ఇట్లు,
గూడూరు శ్రీనివాసరావు,
న్యాయవాది
మిర్యాలగూడ.
సెల్ :99855 39001

రోడ్డు ప్రమాదంలో తాత, మనవడి మృతి

- టీవీఎస్ ఎక్సెల్‌పై రోడ్డు దాటుతుండగా ఢీ కొట్టిన లారీ



చిన్నబాలు (ఫైల్)



గోపిచంద్ (ఫైల్)

కోదాడరూరల్: పొలం వద్దకు వెళ్లేందుకు రోడ్డు దాటుతున్న తాత, మనవడిని లారీ రూపంలో మృత్యువు కబళించింది. సూర్యాపేట జిల్లా కోదాడ మండల పరిధిలోని కూచిపూడి తండా వద్ద సోమవారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మేళ్లచెరువు మండలం రామాంజనేయతండాకు చెందిన లకావత్ చిన్న బాలు(48) అతని అన్న మనవడు లకావత్ గోపిచంద్ (14)లు ఇద్దరు టీవీఎస్ ఎక్సెల్‌పై వ్యవసాయ భూమి వద్దకు బయలుదేరారు. ఈ క్రమంలో కూచిపూడితండా స్టేజీ వద్ద రోడ్డు దాటుతుండగా రామాపురం క్రాస్‌రోడ్ వైపు వస్తున్న సిమెంట్ లారీ వీరి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి రోడ్డు పక్కకు బోల్తాకొట్టింది. ఈ ప్రమాదంలో చిన్నబాలు అక్కడికక్కడే మృతిచెందగా గోపిచంద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని స్థానికులు చికిత్స నిమిత్తం కోదాడకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కాగా బాలుకు భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. గోపిచంద్ కూచిపూడిలో 8వ తరగతి చదువుతుండగా అతని సోదరుడు తలసేమియా వ్యాధితో బాధపడుతున్నట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై బాలు భార్య రజిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సాయిప్రశాంత్ తెలిపారు.

న్యాయం చేయాలని ధర్నా

బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని రామాపురం ప్రధాన రహదారిపై మృతుల బంధువులు, తండావాసులు ధర్నాకు దిగారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యంతోనే రెండు ప్రాణాలు పోయాయని ఆరోపించారు. న్యాయం చేసేంత వరకు ధర్నా విరమించేదిలేదని రోడ్డుపైనే కూర్చున్నారు. దీంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే విధంగా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

భార్యపై కత్తితో దాడి చేసిన భర్త

చిట్యాల: మనస్పర్ధలతో తల్లిగారింటి వద్ద ఉంటున్న భార్యపై భర్త కత్తితో దాడి చేసిన సంఘటన మండలంలోని వెంబావి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంబావి గ్రామానికి చెందిన ఈసం శేషమ్మ, లక్ష్మమ్మ దంపతుల కుమార్తె రాములమ్మ అలియాస్ సరితను ఆరేళ్ల క్రితం మునుగోడు మండలంలోని కొరటికల్ గ్రామానికి చెందిన అద్దంకి సైదులుకు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. ఇటీవల భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు రావడంతో సరిత నెల రోజుల క్రితం తల్లిగారింటికి వచ్చింది. కాగా సోమవారం మధ్యాహ్నం సైదులు తన అత్తగారి ఇంటికి చేరుకుని ఇంట్లో ఒంటరిగా ఉన్న సరితతో గొడవ పడ్డాడు. అనంతరం ఆమెపై కత్తితో దాడి చేసి చేతులు, కాళ్లతో పాటు పలు చోట్ల గాయపరిచాడు. దీంతో ఆమె కేకలు వేయగా, చుట్టుపక్కల వాళ్లు రావటంతో సైదులు అక్కడి నుంచి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన సరితను చికిత్స నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా ఈ సంఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని చిట్యాల పోలీసులు తెలిపారు.

నేడు జిల్లా గ్రంథాలయంలో ఫొటో ఎగ్జిబిషన్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ): అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మంగళవారం తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రం గ్రంథాలయంలో ఫొటో ఎగ్జిబిషన్ పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రారంభించనున్న ఈ ఎగ్జిబిషన్‌కు జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో యూనస్ ఫరాన్ సేకరించిన నల్లగొండ జిల్లా ప్రజల భాషా సాంస్కృతిక జీవన విధానం తెలియజేసే 100 ఏళ్ల నాటి సుమారు 500 ఛాయా చిత్రాలు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ప్రతినిధి యూనస్ ఫరాన్, సీనియర్ అసిస్టెంట్ ఎస్.నర్సింహారెడ్డి, అసిస్టెంట్ లైబ్రేరియన్ కట్ట నాగయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీద్దాం

- మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి

హాలియా: రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీద్దామని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. హాలియా మున్సిపాలిటీ పరిధిలోని అలీనగర్, ఇబ్రహీంపేట గ్రామాల్లో సోమవారం హాథ్ సే హాథ్ జోడో యాత్రను ఆయన ప్రారంభించి మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనతో రాష్ట్ర ప్రజలు విసిగిపోయారన్నారు. సీఎం కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి మోసపూరిత పాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలంతా ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న అరాచకాలు, మోసాలను ప్రజలకు వివరించేందుకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హాథ్ సే హాథ్ జోడో యాత్ర చేపట్టినట్లు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో నాగార్జున సాగర్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువ నాయకుడు కుందూరు జైవీర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కాకునూరి నారాయణ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, అనుముల మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చింతల చంద్రారెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గౌనీ రాజారమేష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు యడవెల్లి నరేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు వెంపటి శ్రీనివాస్, మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మజహర్ మొహినొద్దీన్, నాయకులు కుందూరు రాజేందర్‌రెడ్డి, జూపల్లి శ్రీనివాస్, పాంపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మండలి చైర్మన్ గుత్తాను కలిసిన చింతరెడ్డి



గుత్తా సుఖేందర్‌రెడ్డితో చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: నల్లగొండ జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేసిన చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం చిట్యాల మండలంలోని ఉరుమడ్ల గ్రామంలో రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని మార్యదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూల మొక్క అందజేసి శ్రీనివాస్‌రెడ్డికి గుత్తా సుఖేందర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు.

యాదాద్రి ఆలయ జూనియర్ అసిస్టెంట్ మృతి

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి వారి క్షేత్రంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న వేముల చంద్రయ్య(55) సోమవారం మృతి చెందారు. కొంతకాలంగా చంద్రయ్య అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆరోగ్యం క్షీణించడంతో ఆయన మరణించినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. చంద్రయ్య మృతి పట్ల ఆలయాధికారులు, సిబ్బంది సంతాపం ప్రకటించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Services

■ వ్యక్తిగత, వ్యాపారం, వ్యవసాయ ఆస్తి, టేక్‌ఓవర్ లోన్, NPA కేసులు తక్కువ సిబిల్ స్కోర్ కూడా రుణానికి వర్తిస్తాయి. సంప్రదించండి: 9463846068. [T-1745]

అద్దెకు ఇవ్వబడును
■ నల్లగొండ పట్టణం Hyd రోడ్ మదర్ డెయిరీ ఫాం ఎదురుగా అవనిగడ్డ కోచింగ్ సెంటర్ ప్రక్కన అన్ని వసతులు కలిగిన 2BHK ఇల్లు అద్దెకు ఇవ్వబడును. సంప్ర।। 9493902310 [Y-784303]

లీజుకు ఇవ్వబడును
■ నల్లగొండ పట్టణం సాగర్‌రోడ్ యందు గల ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంప్ లీజుకు ఇవ్వబడును. పూర్తి వివరాలకు సంప్ర।। సెల్ : 9121658685 [YA-14650]

Real Estate

PLOT FOR SALE
■ నల్లగొండ పట్టణం సాగర్ రోడ్ మారుతినగర్ ఇంద్రారెడ్డి రైస్‌మిల్లు వెనుకసైడ్ ప్లాటు 22.5x50 పడమర ఫేస్ గలది అమ్మబడును. బిల్డర్‌కి కట్టి అమ్ముటకు ఇవ్వబడును. సంప్ర।। 9948281402 [Y-784301]
■ హైదరాబాద్ @ రామోజీఫిల్మ్‌సిటీ దగ్గర కొత్తగూడెం ఫ్రూట్ మార్కెట్ & HMDA లాజిస్టిక్ హబ్ పక్కనే ఉన్న మాన్యూ HMDA వెంచర్‌లో ఇల్లు కట్టుకునే ప్లాట్లు కలవు. Ph: 9666607146 [HA-2408]

Wanted

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారాని ₹3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 9573633520, 9059633520 [M-1190579]
■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-781830]
■ ప్రముఖ టూవీలర్ ఫైనాన్స్ కంపెనీ నందు పనిచేయుటకు కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ (పు) కావలెను. బైక్ ఉండవలెను. సంప్ర।। 6303387829, 9676209407 [Y-784306]
■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీవార్డెన్స్, లేడీ సూపర్ వైజర్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు, భార్యాభర్తలు, వాచ్‌మెన్ కావలెను. Ph: 9391036931, 9246585901 [HA-9790]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లైయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

- యాదాద్రి నరసింహుడి క్షేత్రం నాడు.. నేడు



1960 సంవత్సరానికి ముందు యాదగిరిగుట్ట ప్రాంతం



2014కు ముందు యాదగిరి క్షేత్రం ఇలా..



ఆలయం అభివృద్ధి చేసిన తరువాత ప్రస్తుతం 2023లో ఇలా..

యాదగిరిగుట్ట: యాదవ మహర్షి ఘోర తపస్సుతో కొండ గుహల్లో వెలసిన పంచనారసింహుడి క్షేత్రం దినాదినాభివృద్ధి చెందుతోంది. ఒకప్పుడు కీకారణ్యం గుట్టలో వెలసిన శ్రీస్వామికి భక్తులు నిత్యం పూజలు చేస్తుండే వారు. హైదరాబాద్‌కు చెందిన రాజామోతీలాల్ 1920లో శ్రీస్వామికి ఆగమ శాస్త్రం ప్రకారం పూజాది కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి అభివృద్ధి కోసం బాటలు వేసినట్లు చరిత్రకారులు చెబుతారు. ఆ తర్వాత ఆయా ప్రభుత్వాల హయాంలో ఇక్కడ అభివృద్ధికి తోడ్పాటునందించారని సమాచారం. అప్పటి నుంచి దినాదిన ప్రవర్ధమానంగా యాదగిరి క్షేత్రాన్ని అభివృద్ధి చేస్తూ భక్తులకు శ్రీస్వామి దర్శనం ఇస్తున్నారు. ఇక 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధతో యాదాద్రి క్షేత్రాన్ని అభివృద్ధి చేసి గతేడాది మార్చి 28వ తేదీన ప్రధానాలయాన్ని మహా కుంభ సంప్రోక్షణతో వైభవంగా ఉద్ఘాటన కార్యక్రమం చేపట్టి భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తున్నారు.

APGVB ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్
(APGVB) రీజనల్ ఆఫీస్, నల్లగొండ.

బంగారు ఆభరణాల వేలం ప్రకటన

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, ఈ దిగువ తెలుపబడిన మా శాఖల యందు ఖాతాదారులు బంగారు అభరణములు తాకట్టు పెట్టి ఋణములు పొందియున్నారు. అట్టి ఋణం మొత్తం సకాలంలో చెల్లించవలసిందిగా నోటీసులు పంపియున్నాము. గడువులోగా ఋణం చెల్లించని కారణంగా తనఖా పెట్టిన బంగారు అభరణములను "ఎక్కడ ఎలాగ ఉన్నవి అలాగే" అనే ప్రాతిపదికపై ఈ క్రింద తెలియజేసిన శాఖలలో (1) ఎ.డి.వల్లి శాఖ, కన్నేకల్ శాఖ, నేరేడుచెర్ల శాఖలకు సంబంధించిన అభరణములను మిర్యాలగూడ క్లస్టర్ బ్రాంచిలో, (2) చెర్లపల్లి శాఖ, ఈదులూరు శాఖ, యమ్.జి.రోడ్ (యన్) శాఖలకు సంబంధించిన అభరణములను చెర్లపల్లి క్లస్టర్ బ్రాంచిలో, (3) హాలియా శాఖ, మర్రిగూడ శాఖ, పసునూరు శాఖలకు సంబంధించిన అభరణములను దేవరకొండ క్లస్టర్ బ్రాంచిలో, (4) కుడ కుడ రోడ్ శాఖకు సంబంధించిన అభరణములను సూర్యాపేట క్లస్టర్ బ్రాంచిలో ది.28-02-2023 (మంగళవారం) సా।। 5-00 గం।।లకు వేలం నిర్వహించబడును.

క్ర. సం.	అకౌంట్ నెం.	ఋణగ్రహీత పేరు, తండ్రి / భర్త పేరు, చిరునామా	బరువు గ్రాములలో
		ఎ.డి.వల్లి శాఖ	
1	73184314877	యెల్ల ఆంజనేయులు, తండ్రి: రత్నయ్య, అడవిదేవులపల్లి	20.16
2	73184316364	నక్కా రమణ, తండ్రి: వెంకటేశ్వర్లు, ముదిమాణిక్యం	10.50
3	73184556408	యస్.స్వప్న, భర్త: వెన్న, మొలకచెర్ల	9.20
4	73184621083	పాతులోతు బాల, తండ్రి: దీప్ల, గోన్యతండా	20.70
5	73185364157	రావులపాటి రాంబాబు, తండ్రి వెంకయ్య, మొలకచెర్ల	23.30
		కన్నేకల్ శాఖ	
1	73185028320	గంగనబోయిన యశోద, భర్త: హనుమయ్య, నారాయణపురం	30.24
2	73185082990	బండారపు సైదమ్మ, భర్త: బిక్షమయ్య, ధర్మాపురం	12.00
3	73185388634	గంటకంపు కవిత, భర్త: వెంకన్న, కన్నేకల్	20.70
		నేరేడుచెర్ల శాఖ	
1	73184670052	మహేశ్వరి పెద వంగ, భర్త: ఈదయ్య, సోమారం	19.47
2	73184825430	గన్నెరెడ్డి కృష్ణారెడ్డి, తండ్రి: గోవిందురెడ్డి, నేరేడుచెర్ల	41.52
3	73184864912	చిట్టిమల్ల శివ, తండ్రి: శంకర్, నేరేడుచెర్ల	9.05
		చెర్లపల్లి శాఖ	
1	73184556861	కొడదల సైదులు, తండ్రి: మల్లయ్య, చెర్లపల్లి	28.30
		ఈదులూరు శాఖ	
1	73184618923	సూరి వెంకన్న, తండ్రి: బిక్షమయ్య, ఈదులూరు	9.61
2	73185166020	జాల నర్మద, భర్త: సైదులు, ఈదులూరు	20.40
3	73185440721	తవిడబోయిన అజయకుమార్, తండ్రి: నర్సయ్య, ఈదులూరు	52.30
		యమ్.జి.రోడ్ (యన్) శాఖ	
1	73184159321	చింతమల్ల నాగమణి, భర్త: అమృతం, మూషంపల్లి	20.00
2	73185406892	కొడుదుల ప్రశాంత్‌రెడ్డి, తండ్రి: సైదారెడ్డి, మూషంపల్లి	23.50
3	73185413980	సత్యనారాయణ అమరపడి, తండ్రి: బుచ్చిరాములు, కొత్తపల్లి	80.60
		హాలియా శాఖ	
1	73184649372	ఎల్లబోయిన లింగయ్య, తండ్రి: గంగయ్య, పుల్లారెడ్డిగూడెం	19.90
2	73184769620	గుండెబోయిన లక్ష్మమ్మ, భర్త: పెద్దులు, హాలియా	24.86
		మర్రిగూడ శాఖ	
1	73184461196	బేరంగుల చినసరసింహ, తండ్రి: ఈదయ్య, వెల్లగూడెం	14.98
2	73184647614	మెండు తిరుపతిరెడ్డి, తండ్రి: వెంకట్‌రెడ్డి, వట్టిపల్లి	30.39
3	73184691346	మెఘావత్ మంజుల, భర్త: జె.నక్కు, గాంధీనగర్ తండా	47.59
4	73184791623	సునీత ఈర్ల, భర్త: స్వామి, లెంకలపల్లి	12.14
5	73184915834	అచ్చమ్మ ఇడ్డ, భర్త: ముత్యయ్య, వట్టిపల్లి	35
6	73185070698	బొంత ముత్తమ్మ, భర్త: మల్లయ్య, శివన్నగూడెం	30.97
7	73185101324	వల్లంల దశరథ, తండ్రి: మల్లయ్య, యెర్రగండ్లపల్లి	47.53
8	73185120110	కృష్ణయ్య పోకల, తండ్రి: ఇద్దయ్య, సారంపేట	18
9	73185135332	పాల్వాయ్ విద్యాసాగర్ రెడ్డి, తండ్రి: భూపాల్‌రెడ్డి, మర్రిగూడ	135.16
10	73185135911	పాల్వాయ్ విద్యాసాగర్ రెడ్డి, తండ్రి: భూపాల్‌రెడ్డి, మర్రిగూడ	148.16
11	73185265770	వీరమల్ల పెంటయ్య, తండ్రి: సిలేమాను, మర్రిగూడ	20.86
12	73185267755	వల్లపు రఘు, తండ్రి: యల్లయ్య, శివన్నగూడెం	40.34
13	73185409666	వల్లపు రఘు, తండ్రి: యల్లయ్య, శివన్నగూడెం	39.42
		పసునూరు శాఖ	
1	73184930307	పగిళ్ల శ్రీనివాసులు, తండ్రి: లచ్చయ్య, మిర్యాలపాడ్	12.64
2	73185328823	శ్రీహరి బుడిగ, తండ్రి: ముత్యాలు, పసునూరు	9.99
		కుడ కుడ రోడ్ శాఖ	
1	73185290966	కుసునోజు సవిత, భర్త: తిరుమలాచారి, బలాపురం	30.64
2	73185291824	కుసునోజు తిరుమలాచారి, తండ్రి: పిచ్చయ్య, బలాపురం	29.49

వేలం నియమ నిబంధనలు: (1) వేలం APGVB పైన తెలిపిన క్లస్టర్ బ్రాంచీల యందు జరుపబడును. (2) వేలంలో పాల్గొనదలచినవారు రూ.10,000/- సెక్యూరిటీ డిపాజిట్ చేయవలెను. (3) విజయవంతమైన పోటీదారుడు డబ్బు మొత్తం వెంటనే చెల్లించి అభరణములు తీసుకొనవలెను. (4) అభరణములు వేలం సమయములో మాత్రమే తనిఖీ చేసుకొనవలెను. (5) సరియైన విలువ రానిచో లేదా ఏ కారణము లేకుండా వేలం రద్దు చేయుటకు బ్రాంచి మేనేజర్‌కు అధికారం కలదు. మిగతా వివరాలకు ఆయా శాఖల బ్రాంచి మేనేజర్లను సంప్రదించగలరు.
ఇట్లు: రీజనల్ మేనేజర్, APGVB, రీజనల్ ఆఫీస్, నల్లగొండ